🌐 : www.aknu.edu.in
✉ : nannayavani@aknu.edu.in
▶ : nannayanewstv
f : Adikavi Nannaya University
☏ : 9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 2 | సంచిక : 29 | 25-04-2022 | పుటలు : 4



చిరంజీవి సత్యశ్రీకీర్తి

## ఏప్రిల్ 29 అంతర్జాతీయ నృత్య దినోత్సవం

భారతదేశంలో ప్రాచుర్యంలో ఉన్న నాట్య, నృత్య రీతులను భారతీయ నాట్యం లేదా భారతీయ నృత్యం అంటారు. భారత్ లో అనేక నాట్యరీతులు కానవస్తాయి. శాస్త్రీయంగా చూస్తే, ప్రతి రాష్ట్రంలోనూ సాంస్కృతిక నాట్యాలు ఉన్నాయి. అలాగే బాలీవుడ్ లో నాట్యం ప్రత్యేకత సంతరించుకొని, ప్రపంచవ్యాప్తంగా అభిమానాన్ని చూరగొన్నది.
భారతీయ నాట్యరీతులు అనేక విధాలు. వీటిని ప్రధానంగా రెండు విధాలుగా వర్గీకరించవచ్చు

1. సంప్రదాయ నృత్యాలు లేదా శాస్త్రీయ నృత్యాలు
2. జానపద, గిరిజన నృత్యాలు.

ఇవే కాకుండా ప్రస్తుతం అన్ని రీతులనూ, ప్రధానంగా పాశ్చాత్య, దేశీయ విదానాలను మేళవించి రూపొందించిన నృత్య విధానాలు ప్రస్తుతం జనాదరణ కలిగి ఉన్నాయి. సినిమా రంగంలో ఇవి ప్రముఖమైన స్థానాన్ని ఆక్రమిస్తున్నాయి. వీటిని "ఆధునిక నృత్యాలు" అనవచ్చును.

**శాస్త్రీయ నాట్యరీతులు**
కూచిపూడి,భరతనాట్యం,కథక్, కథకళి,మణిపురి,ఒడిస్సీ,మోహినీ ఆట్టం,సత్త్రియ నృత్యం.

**జానపద నాట్యరీతులు**
వీధి నాటకం,బుర్రకథ,గంటమర్ధాల, కోలాటం,పేరిణి,తోలుబొమ్మలాట, ధింసా నృత్యం,చిందు నృత్యం .

# నన్నయలో కందుకూరి పీఠం ఏర్పాటు చేస్తాం



**22.04.22 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో కందుకూరి పీఠాన్ని ఏర్పాటు చేసి, యుగపురుషుడు, నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం సంఘ సంస్కరణల కృషిని భావితరాలకు తెలియజేస్తామని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ, కె.ఆర్.ఎస్ - టి.ఎస్.బి. చారిటబుల్ బ్రహ్మ సమాజ్ ట్రస్ట్, కాకినాడ సౌజన్యంతో యుగపురుషుడు, నవయుగ వైతాళికుడు శ్రీ కందుకూరి వీరేశలింగం జయంత్యుత్సవం - కందుకూరి@175 గ్రంథావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు, ప్రధానవక్త మేనేజింగ్ ట్రస్టీ, చెన్నపూరి తెలుగు అకాడమీ డా.తూమాటి సంజీవరావు, అతిథులుగా డా.దాట్ల దేవదానంరాజు, పల్లెసిరి కార్యదర్శి పలుకూరు మురళీధర్ హాజరై కందుకూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డా.తూమాటి సంజీవరావు ప్రచురించిన కందుకూరి@175 గ్రంథాన్ని వీసీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో యుగపురుషుడు, నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం జయంత్యుత్సవాన్ని నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. మూఢత్వంలో ఉన్న ఆనాటి సమాజ పరిస్థితులను సంస్కరించడంలో కందుకూరి ఎంతో కృషి చేసారని చెప్పారు. కందూకూరి చేసిన కృషిని, సంఘసంస్కరణ ఉద్యమాల ఫలితాలను భావితరాలకు అందించేందుకు విశ్వవిద్యాలయం సహకరిస్తుందని అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయంలో కందుకూరి పీఠాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు.యూనివర్సిటీ నుండి రూ.5 లక్షలు నిధులు కేటాయిస్తామని, దాతల సహకారంతో మరో రూ.5లక్షలు సేకరించి కందుకూరి పీఠాన్ని స్థాపించి వివిధ కార్యక్రమాలు, పరిశోధనలు చేయవచ్చునని చెప్పారు. కందుకూరి స్త్రీ విద్యను ఎంతో ప్రోత్సహించారని అదే క్రమంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ద్వారా ఎక్కువ మంది స్త్రీలు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని తెలియజేసారు. విశ్వవిద్యాలయ సిబ్బందిలో కూడా ఎక్కువ మంది స్త్రీలు ఉన్నారని, పరిపాలన కార్యక్రమాలలో వారు కీలక పాత్రను పోషిస్తున్నారని చెప్పారు. కందుకూరి వివేకవర్ధని పత్రిక ద్వారా అవినీతిపరులపై యుద్ధం సాగించారని, మనమంతా నీతిగా జీవించాలని సూచించారు. కందుకూరి జీవించిన ప్రాంతంలో ఉన్న మనమంతా కందుకూరి ఆశయ సాధనకు కృషి చేయాలని తెలియజేసారు. "సుబ్రహ్మణ్య భారతి దృష్టిలో కందుకూరి" అనే అంశంపై ప్రధానవక్త మేనేజింగ్ ట్రస్టీ, చెన్నపూరి తెలుగు అకాడమీ డా.తూమాటి సంజీవరావు ఉపన్యసించారు. అతిథులుగా విచ్చేసిన సాహితీవేత్త డా.దాట్ల దేవదానంరాజు, పల్లెసిరి కార్యదర్శి పలుకూరు మురళీధర్ కందుకూరి సేవలను ప్రశంసిస్తూ సందేశాలనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, ప్రిన్సిపాల్ డా.కె.రమణేశ్వరి, కన్వీనర్ తెలుగు విభాగాధిపతి డా.కె.వి.ఎన్.డి.వరప్రసాద్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# నన్నయ అభివృద్ధికి కృషి చేద్దాం


## ఫౌండేషన్ డే లో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్

**22.04.22 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని, వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు నాయకత్వంలో విశ్వవిద్యాలయం మరింత అభివృద్ధిని సాధిస్తుందని రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ అన్నారు. యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో శుక్రవారం యూనివర్సిటీ ఫౌండేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదికవి నన్నయ విగ్రహానికి, దివంగత నేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి, స్వర్గీయ జక్కంపూడి రామ్మోహనరావు చిత్రపటాలకు విశ్వవిద్యాలయ అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మాట్లాడుతూ ఎందరో మహనీయుల కృషి ఫలితంగా 2006వ సంవత్సరంలో ప్రారంభమైన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం దినదినాభివృద్ధి చెందుతుందని అన్నారు. వై.ఎస్.రాజశేఖరరెడ్డి, జక్కంపూడి రామ్మోహనరావు, గోదావరి విశ్వవిద్యాలయ సాధన సమితి సభ్యుల కృషికి నిదర్శనం నన్నయ విశ్వవిద్యాలయమన్నారు. విశ్వవిద్యాల యానికి ఉపకులపతులుగా ఆచార్య నిరూపరాణి, ఆచార్య జార్జ్ విక్టర్, ఆచార్య ఎం.ముత్యాలు నాయుడు తో పాటు కొందరు ఇన్చార్జ్ వీసీలు గా పని చేసారని, ప్రస్తుత వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు విశేష సేవలందిస్తున్నారని చెప్పారు. 16 సంవత్సరాల విశ్వవిద్యాలయ అభివృద్ధిలో ప్రతీ సిబ్బంది పాత్ర కీలకమైనదని తెలిపారు. ప్రస్తుత ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు విశ్వవిద్యాలయానికి అవసరమైన అన్ని గుర్తింపులు తీసుకువచ్చారని కొనియాడారు. కొవిడ్ సంక్షోభంలో పరీక్షల నిర్వహణ, వందకు పైగా వెబినార్స్ నిర్వహణ, ఆసియ, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఐ.ఎస్.ఓ, ఎ.ఐ.సి.టి.ఇ. గుర్తింపులను తీసుకువచ్చారని చెప్పారు. క్రీడాభివృద్ధికి నిధులు, సైకలాజికల్ కౌన్సిలింగ్ సర్వీసెస్, నన్నయవాణి పత్రిక, నన్నయభారతి, నన్నయ విజ్ఞాన కేంద్రం, జెస్టోర్, జెగేట్, స్టూడెంట్ క్లబ్స్, భవన నిర్మాణాలు ఇలా అన్ని కోణాలలో ప్రగతిని సాధించామన్నారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి నాక్ గుర్తింపు ఎంతో అవసరమని భావించి నాక్ సాధనకు కృషి చేస్తున్నారని ఇటీవల నాక్ ఎస్.ఎస్.ఆర్‌ను సమర్పించామని చెప్పారు. విశ్వవిద్యాలయం భవిష్యత్‌లో మరిన్ని విజయాలను చూడబోతుందని తెలయజేసారు. మనమంతా సమష్టిగా పని చేసి విశ్వవిద్యాలయాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే సంస్థ ప్రయోజనాలు ముఖ్యమని గుర్తు చేసారు. ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆయా ఉపకులపతుల కాలంలో సాధించిన విజయాలను ప్రస్తా వించారు. కోవిడ్ కాలంలో ఆచార్య మొక్కా జగన్నాథరావు లాంటి ఉపకులపతి విశ్వవిద్యాల యానికి వీసీ గా రావడం మనందరి అదృష్టమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్వ విద్యాలయ అధికారులు డా.కె.రమణేశ్వరి, ఆచార్య పి.సురేష్ వర్మ, డా.పి.వెంకటేశ్వరరావు, డా.పి.విజయ నిర్మల, డా.డి.జ్యోతిర్మయి, డా.బి.కెజియారాణి, డా.కె.నూకరత్నం, ఎస్.లింగారెడ్డి, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



నన్నయ, వై.ఎస్.ఆర్, జక్కంపూడి లకు నివాళులర్పిస్తున్న అధికారులు

## సంపాదకీయం



# విద్యావృక్షం!

చెట్టు ప్రగతికి మెట్టు. ప్రాణుల విశ్రాంతికి ఆటపట్టు. కొమ్మల్ని విస్తరించి పదిమందికి నీడనిస్తుంది. రాళ్ళను విసిరిన వారిపై పువ్వుల్ని వర్షిస్తుంది. కర్రలతో కొట్టిన వారికి పళ్ళను అందిస్తుంది. సాయంత్రానికి తన గూటికి పక్షులు ఇంకా చేరలేదేమని చలించిపోతుంది. అవి ఇంటికి చేరగానే కదలకుండా శాంతినిస్తుంది. ఇది చెట్టు సహజ లక్షణం.

విద్యయా అమృతమశ్నుతే!. విద్య ద్వారా అమృతత్వం లభిస్తుందని. అమృత ఫలాల్ని అందిస్తుందని అర్థం. పదహారేళ్ళ క్రితం నన్నయ విశ్వవిద్యాలయం అనేది రాజమహేంద్రవరంలో నాటిన మొక్క. నేటికి మొక్కా జగన్నాథ రావుగారి సారథ్యంలో మహా వృక్షమైంది.

విశ్వ విద్యాలయం కొన్ని వ్యవస్థలతో, కొన్ని కోర్సులతో ప్రథమ ఉపకులపతి ఆచార్య కె.నిరూపారాణి గారి ఆధ్వర్యంలో ప్రారంభమైంది. రాజమండ్రి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వేదికైంది. మరికొన్ని అద్దె భవనాల్లో తరగతులు మొదలయ్యాయి.

అదనపు బాధ్యతలో భాగంగా నాటి ఉపకులపతి ఆచార్య బీలా సత్యనారాయణగారు సేవలందించారు. చెన్నై కలకత్తా జాతీయ రహదారిని ఆనుకుని రాజానగరం మండలం వెలుగుబందలో అక్షర యజ్ఞానికి వందెకరాల స్థలాన్ని సమీకరించారు నాటి మంత్రివర్యులు శ్రీ జక్కంపూడి రామ్మోహన్ రావు గారు.

నన్నయ విశ్వవిద్యాలయ అదనపు బాధ్యతను స్వీకరించిన కాకినాడ జె.ఎన్.టి.యు ఉపకులపతి ఆచార్య అల్లం అప్పారావుగారు నన్నయ విగ్రహాన్ని ప్రతిష్టించి, తెలుగు కోర్సు ప్రారంభించి విద్యా కార్యక్షేత్రంగా మలిచే ప్రయత్నం చేశారు.

రెండవ ఉపకులపతి ఆచార్య పసలపూడి జార్జ్ విక్టర్ గారు రోడ్లు, భవన నిర్మాణాలు ప్రారంభించారు. రావి,వేప,మర్రి వృక్షాలను ప్రణాళికాబద్ధంగా ఏళ్ళపాటు నీడనివ్వటానికి సిద్ధం చేశారు. ఉభయ గోదావరి జిల్లా కళాశాలలను విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలుగా మార్చారు. ఆయన పడినతపనలో ప్రతిమట్టి రేణువులో ఆయన పాద స్పర్శ ఉంటుంది.

మూడవ ఉపకులపతి ఆచార్య ముర్రు ముత్యాలు నాయుడుగారు మరి కొన్ని భవనాలకు, కోర్సులకు, ప్రయోగశాలలకు, విద్యార్థుల వసతి భవనాలకు అంకురార్పణ చేశారు. విశ్వవిద్యాలయానికి 12బి స్టేటస్ తీసుకువచ్చారు. కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాల్ని నన్నయకు అనుబంధం చేశారు.

ఆయా సందర్భాలలో అదనపు బాధ్యతలు స్వీకరించిన ఆచార్య ఈ.ఎన్.ధనంజయరావుగారు, ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీలు, ఆచార్య సుంకరి రామకృష్ణారావు గారు, ఆచార్య ఏ.వి.ప్రసాదరావు గారు, ఆచార్య పి.సురేష్ వర్మ గారు తమవంతు కర్తవ్యాల్ని నిర్వహించారు.

నాల్గవ ఉపకులపతిగా ఆచార్య మొక్కా జగన్నాథరావుగారు బాధ్యతలు స్వీకరించి మొక్కగా ఎదుగుతున్న విశ్వవిద్యాలయాన్ని మహా విద్యావృక్షంగా ఎదగడానికి కావలసిన అవసరాలను గుర్తించారు. ముందుగా ఏ.ఐ.సి.టి.ఇ., ఐ.ఎస్.ఓ గుర్తింపులను తీసుకొచ్చారు. ప్రపంచం కోవిడ్ సంక్షోభంలో చిక్కుకున్న సందర్భంలో అందరూ ఇంటికి పరిమితమైతే సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యాభివృద్ధికి మలుచుకుని విద్యార్థులకు,ఆచార్యులకు, పరిశోధకులకు ఉపయుక్తంగా అన్ని విభాగాలతో వందకు పైగా వెబినార్స్ నిర్వహించి స్తబ్దతను ఛేదించారు. అనుబంధ కళాశాలల్లో నిర్వహింపజేసినవి అపరిమితం.

విశ్వవిద్యాలయంలో జెగేట్, జెస్టోర్ నన్నయవాణి పత్రిక, నన్నయ విజ్ఞాన భారతి, వినూత్న, కౌన్సిలింగ్ సెంటర్, స్టూడెంట్ క్లబ్స్, ప్రాంగణ పర్యావరణం, నన్నయభారతి, నన్నయ స్టడీ సెంటర్, ఆసియా, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, క్రీడాభివృద్ధి అంశాలు, కాకినాడ – తాడేపల్లిగూడెం ప్రాంగణాల్లో అభివృద్ధి కార్యక్రమాలు ....వెరసి క్షణక్షణాభివృద్ధి పరంపర.

ఈ ఏడాది పదహారేళ్ల వ్యవస్థాపక దినోత్సవం నాటికి న్యాక్ గుర్తింపు కోసం పడిన కష్టాన్ని రిపోర్ట్ రూపంగా సమర్పించడమైంది. త్వరలోనే మంచి గుర్తింపు లభిస్తుంది. దాని వలన వచ్చే ఫలాలు విశ్వవిద్యాలయాభివృద్ధికి మరింత దోహదం చేసి గోదావరి జిల్లాల విద్యాభివృద్ధికి కారణమవుతాయని ఆశిద్దాం!!

# మధుర వాక్కులు


పుస్తకం

“మధుర వాక్కులు” పలకలూరి శివరావు గారు తయారుచేసిన సూక్తుల పుస్తకం. వేగవంతమైన ఈ యాంత్రిక యుగంలో ఛందో బద్ధమైన సాహిత్యం చదివే ఓపిక,తీరిక పాఠకులకు లేదు. కారణం ఏమంటే పరిగెడుతున్న జీవనశైలి. క్లుప్తంగా ఉండి, తేలిక భాషలో ఉన్న మాటలని కొంత వరకూ చదివే అవకాశం ఉంది. అందుకనే ఆయన మధుర వాక్కులను అతి క్లుప్తంగా సులభశైలిలో పొందుపరిచారు.

అనేక గ్రంథాలను అధ్యయనం చేసిన పిమ్మట మేధావులు వెలిబుచ్చిన జీవన విధానాన్ని సూక్తుల రూపంలో మనకు అందించారు రచయిత. చంద్రునికో నూలుపోగులా సమాజానికి సేవ చేయాలనే తపనతో, అవగాహన పెరగటానికి మధుర వాక్కులను ప్రోగుచేశారు. వాటిని ప్రచురించి పాఠక లోకానికి అందించారు. పరమోత్కృష్టమైన మానవజన్మను చరితార్థం చేసుకునేవారు కోటానుకోట్ల మందిలో ఏ కొందరు మాత్రమే ఉంటారు. వారికి చేతనైన సహాయం చేయాలనే తపనగల వ్యక్తుల్లో సేవారత్న శివరావుగారొకరు. ఆయన గుంటూరు ప్రాంతానికి చెందినవారు.

వంద పేజీల పుస్తకంలో వేలకొలది సూక్తులను అందించారు. రాతిని మలచేవాడు శిల్పి – మనసును మలచే వాడు గురువు, శాంతంగా ఉండే వారి మనసు స్వర్గం లాంటిది, ఎక్కువగా వినాలి – తక్కువగా మాట్లాడాలి, మంచి పనిని వాయిదా వేయకు – చెడ్డ పని తలపెట్టకు, ఔన్నత్యం సంపద వల్ల రాదు–సద్గుణాల వల్ల వస్తుంది. ఇటువంటి మంచి సూక్తులు మధుర వాక్కులు పుస్తకంలో కోకొల్లలు.

శబ్దం పరబ్రహ్మ స్వరూపం. వాగ్భూషణమే భూషణంగా భాసిల్లుతుంది. పలకరింత ఓ పులకరింతను కలుగజేస్తుంది. అటువంటి మాటే మంత్రంలా పనిచేస్తుంది. మంత్రంలాంటి మాటలు ‘మధుర వాక్కులు’ పుస్తకంనిండా బోలెడన్ని ఉన్నాయి. మంత్రాల్లాంటి సూక్తులు మన సంస్కృతిలోంచి పుట్టుకొచ్చిన మహత్తరమైన అక్షర సందేశాలు. ప్రతి మనిషి మంచి మాటలతో, చేతలతో మంచి మనిషిగా బ్రతకటానికి ఉపయోగపడాలని ఈ పుస్తకాన్ని సిద్ధం చేశారు రచయిత. తాను నడుస్తున్న సేవాపథంలోనికి నేటి తరాన్ని ఆహ్వానిస్తున్నారు. శుభమస్తు!




–డా. కృష్ణభవాని
సైకాలజీ డిపార్ట్మెంట్


# జియో సైన్సెస్‌లో అవకాశాలను అందిపుచ్చుకోవాలి

తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించాలని, జియో సైన్సెస్ లో అవకాశాలను అందిపుచ్చుకోవాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ జియో సైన్సెస్ విద్యార్థులు ఫ్రెషర్స్ డే సెలబ్రేషన్స్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై విద్యార్థులనుద్దేశించి ఉపన్యసించారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులకు మంచి పేరుప్రఖ్యాతలు తీసుకువచ్చే విధంగా విద్యార్థులు ఎదగాలని, కాలాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత విద్యలో మంచి ఫలితాలను సాధించాలన్నారు. గురువులు తమకు ఉన్న పరిచయాలను ఉపయోగించి విద్యార్థులకు చక్కని మార్గనిర్దేశం చేస్తూ జియో సైన్సెస్ లో ఉన్నత శిఖరాలలో నిలపాలన్నారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, ఓ.ఎన్.జి.సి, మైనింగ్ వంటి సంస్థల సహకారంతో విద్య, శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా కృషి చేయాలన్నారు. విద్యార్థులు తమ సామర్థ్యాలను పెంపొందించుకోవాలని, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని, విద్యార్థుల ప్రతిభను వారి రెజ్యూమ్ చెబుతుందన్నారు. జియలాజికల్ క్లబ్స్ ను ఏర్పాటు చేసి ప్రతీ వారం వివిధ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. జియో సైన్సెస్ లో నిపుణుల ఉపన్యాసాలు, కెరియర్ డిస్కర్షన్, జి.ఎస్.ఐ ప్రోగ్రామ్స్ చర్చావేధికలు వంటివి నిర్వహించాలన్నారు. క్యారెక్టర్, కమిటెమెంట్, కమ్యూనికేషన్ స్కిల్స్ తో విద్యార్థులు ఉన్నత విద్యలో రాణిస్తూ ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడాలన్నారు. జియో సైన్సెస్ విద్యార్థులకు ఇండస్ట్రీయల్ టూర్ చాలా ప్రధానమైనదని జియలాజికల్ ఇండస్ట్రీయల్ టూర్ ను నిర్వహించుకొనేందుకు విశ్వవిద్యాలయం తరుపున ఆర్థిక సహకారం అందిస్తామన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం జియోసైన్సెస్ లో ప్రవేశాలు పొందిన విద్యార్థులంతా ఉన్నత ఆలోచనలతో విశ్వవిద్యాలయంలోని వనరులను, వసతులను, లైబ్రరీ విజ్ఞానాన్ని పూర్తిగా సద్వి నియోగం చేసుకుంటూ ఉన్నత విద్యలో మెరుగైన ఫలితాలను అందించాలన్నారు. తరువాత విద్యార్థులు వీసీ జగన్నాథరావును శాలువాతో సన్మానించి అభినందించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డా.కె.నూకరత్నం, ఆచార్య వై.శ్రీనివాసరావు, డా.కె.వి.స్వామి, డా.కె.శామ్యూల్ పీటర్, సుధారాణి, జి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

## మంచి మాట



ఎవ్వరినీ
చులకనగా
చూడొద్దు.
ఎవరికి
తెలుసు...
ఈరోజు మనం
తొక్కిన రాయి
రేపు శిలగామారి
గుడిలో దైవం
కావచ్చు.



ఏప్రిల్
22

## ధరిత్రీ దినోత్సవ శుభాకాంక్షలు!!

– నన్నయవాణి

ఆజానుబాహులారా!
ఓజోనుపొరను రక్షించండి!!

మనం ధరిత్రిని రక్షిస్తేనే
ధరిత్రి మనల్ని రక్షిస్తుంది
మనం ధరిత్రిని భక్షిస్తే
ధరిత్రి మనల్ని శిక్షిస్తుంది
ధరిత్రి విశ్వరూపం ధరించకముందే
చరిత్ర సృష్టిద్దాం పర్యావరణ పరిరక్షణలో....

– ఐ.ఎన్.గిరి

# నన్నయ వీసీని కలిసిన ఐ.పి.ఇ. డైరెక్టర్

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావును ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్ప్రైజ్ (ఐ.పి.ఇ) హైదరాబాద్ డైరెక్టర్ ఆచార్య ఎస్.శ్రీనివాసమూర్తి మర్యాదపూర్వకంగా కలిసారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇటీవల కాలంలో సాధించిన అభివృద్ధిపై వీసీని ప్రశంసించారు. యూనివర్సిటీకి, ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్ప్రైజ్ కు మధ్య ఎం.వో.యు పై పలు విషయాలను చర్చించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయ అభివృద్ధి, విద్యార్థుల ప్రయోజనార్థమై ఎం.వో.యు రెన్యువల్ చేద్దామన్నారు. ఈ ఎం.ఓ.యూ ద్వారా స్టూడెంట్ ఎక్స్ చేంజ్ ప్రోగ్రామ్స్, ఫ్యాకల్టీ ఎక్స్ చేంజ్ ప్రోగ్రామ్స్ జరుగుతున్నాయని తెలియజేసారు. జాయింట్ రిసెర్చ్ ప్రోగ్రామ్స్, జాయింట్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్స్ మరియు ఎక్స్ట్రా మ్యూరల్ పి.హెచ్.డి., ప్రొగ్రామ్స్ వంటివి అందిస్తామన్నారు. జాయింట్ ఎంబీఏ ట్విన్నింగ్ ప్రోగ్రామ్స్ కు నూతన జాతీయ విద్యా విధానంలో ప్రాధాన్యం ఉందని దానికి అనుగుణంగా కార్యక్రమాలు నిర్వహించవచ్చునని చెప్పారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ, ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్ప్రైజ్ (ఐ.పి.ఇ) సంయుక్తంగా సర్టిఫికెట్స్ ఇస్తామని తెలిపారు. జాతీయ సంస్థ వంటి ఐ.పి.ఇ ద్వారా చక్కని ప్లేస్మెంట్స్ వచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. దీనిపై డైరెక్టర్ ఆచార్య ఎస్.శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్ప్రైజ్ (ఐ.పి.ఇ) హైదరాబాద్ ను సందర్శించాలని వీసీ జగన్నాథరావును ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి పాల్గొన్నారు.



నన్నయ వీసీని కలిసిన ఐ.పి.ఇ డైరెక్టర్ శ్రీనివాసమూర్తి

## నన్నయలో మొక్కలు నాటిన అధికారులు



మొక్కలు నాటుతున్న విశ్వవిద్యాలయ అధికారులు

**22.04.22 (మీడియాసెల్)** ధరిత్రీ దినోత్సవం సందర్భంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో విశ్వవిద్యాలయ అధికారులు మొక్కలు నాటారు. యూనివర్సిటీ బోటని విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ వెనుక బొటానికల్ గార్డెన్ లో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మాట్లాడుతూ ప్రకృతి ఒడిగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాన్ని తీర్చిదిద్దాలనే లక్ష్యంతో నిరంతరం పని చేస్తున్నామని చెప్పారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు నాయకత్వంలో విశ్వవిద్యాలయ ప్రాంగణంలో 40 ఇంకుడు గుంటలు త్రవ్వించి భూగర్భజలాల పెంపుకు కృషి చేసామన్నారు. విశ్వవిద్యాలయంలో తరచూ మొక్కలునాటే కార్యక్రమాలను చేపడుతున్నామని చెప్పారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసామన్నారు. ఈ కార్యక్రమంలో ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, విశ్వవిద్యాలయ అధికారులు పాల్గొన్నారు.

## గూడెం, కాకినాడ ప్రాంగణాల్లో ఫౌండేషన్‌డే వేడుకలు



ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఫౌండేషన్ డే ను తాడేపల్లిగూడెం, కాకినాడ క్యాంపస్‌లో ఘనంగా నిర్వహించారు. తాడేపల్లిగూడెం క్యాంపస్ ప్రిన్సిపల్ ఆచార్య కె.శ్రీ రమేష్ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు కారణమైన గోదావరి విశ్వవిద్యాలయ సాధన సమితి, స్థానిక నాయకులు, మహనీయుల కృషిని వివరించారు. వీసీ జగన్నాథరావు మార్గదర్శకంలో క్యాంపస్ అభివృద్ధి పథంలో పయనిస్తుందని అన్నారు. అలాగే కాకినాడ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్‌లో ప్రిన్సిపాల్ డా.ఎం.కమల కుమారి నన్నయ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కాకినాడ క్యాంపస్ సాధిస్తున్న పురోగతిని, వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు సహకారాన్ని ప్రశంసించారు.



## ఏయూ వీసీకి నన్నయ ప్రశంసలు



ఆంధ్ర విశ్వవిద్యాలయంలో రెండు రోజుల మెగా జాబ్ మేళాను విజయవంతంగా నిర్వహించిన సందర్భంగా నన్నయ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు తరుపున అధ్యాపకులు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డిని కలిసి ప్రశంసించారు. ఉమ్మడి గోదావరి జిల్లాల పక్షంగా నన్నయ అధ్యాపకులు ఏయూ జాబ్ మేళాలో సేవలు అందించారు.

## ఎ.డబ్ల్యూ.ఎస్‌తో నన్నయ ఒప్పందం

**21.04.22 (మీడియాసెల్)** అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఎ.డబ్ల్యూ.ఎస్) అకాడమితో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఒప్పందం కుదుర్చుకుందని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు తెలిపారు. యూనివర్సిటీ గురువారం దీనికి సంబంధించిన వివరాలను వీసీ తెలియజేసారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ తో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఒప్పందం కుదుర్చుకుందని అన్నారు. విద్యార్థులకు అమెజాన్ వెబ్ సర్వీసెస్ క్లౌడ్ టెక్నాలజీస్ పై శిక్షణ ఇస్తూ సర్టిఫికేషన్ ఇస్తారని చెప్పారు. శిక్షణ అనంతరం ఇన్టెన్షిప్, ఉద్యోగావకాశాలు కల్పిస్తారని తెలిపారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఈ ఒప్పందం ద్వారా ఎంతో ప్రయోజనం చేకురుతుందని చెప్పారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ లోని 50 మంది విద్యార్థులకు అమెజాన్ వెబ్ సర్వీసెస్ ద్వారా ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో శిక్షణ అందిస్తున్నారని చెప్పారు. ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్, విభాగాధిపతి డా.పి.వెంకటేశ్వరరావు, కోఆర్డినేటర్ పి.ఎస్.వి.డి.గాయత్రి సహకారంతో యూనివర్సిటీ పి.హెచ్.డి స్కాలర్ ఎన్. ఆదిత్య సుందర్ ఈ ఒప్పందంకు కృషి చేసారన్నారు.

## ఫార్మసీ విభాగం స్వచ్ఛ్ భారత్





ఆదికవి నన్నయ యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫార్మసీ స్వచ్ఛ్ భారత్ మరియు ఎన్విరాన్‌మెంట్ ఎకో క్లబ్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని క్యాంపస్‌లో నిర్వహించి కళాశాల ఆవరణతో పాటు సంబంధిత ల్యాబ్‌లు, తరగతి గదులను శుభ్రం చేశారు. బి. ఫార్మసీ విద్యార్థినులు పాతాల కుసుమ, ఎస్.లోకేశ్ అధ్యక్షత న ఈ కార్యక్రమం నిర్వహించగా, ఎన్ఎస్ఎస్‌లో చీఫ్ కోఆర్డినేటర్ జె కృష్ణంరాజు, కోర్సు సమన్వయకర్త డా.హీరా బట్టు, మరియు అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా. సురేంద్రబాబు, శ్రీ నిత్యానందరెడ్డి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల విద్యార్థులను ప్రోత్సహించారు.

# ఏప్రిల్ 23 ప్రపంచ పుస్తక దినోత్సవం

పుస్తకం హస్త భూషణం' – అంటే చేతికి పుస్తకాలు ఆభరణం వంటివి అని అర్థం. పుస్తకాలను గురించి "చిరిగిన చొక్కా అయినా తొడుక్కోగానీ ఒకమంచి పుస్తకం కొనుక్కో"మని అంటారు.దేశంలో, ప్రపంచంలో పుస్తకం చేతుల్లో పెట్టుకుని ఊరూరా విగ్రహాలు కలిగిన నాయకుడు ఎవరైనా ఉంటే అది ఒకే ఒక మహా నాయకుడు అయిన డా.అంబేద్కర్. సంవత్సరాలు, రోజులు తరబడి పుస్తక పఠనంలోనే డా.అంబేద్కర్ మునిగిపోయేవారుట.

ప్రపంచం నేడు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ఆనాడే ఆయన ఎలుగెత్తి చాటారు.ప్రతీ అంశంపై వ్యాసాలు రాసారు.అవి చదివితే వారు ఎంత దార్శనికులో మనకు అర్థం అవుతుంది.అవన్నీ చదవాలంటే పుస్తక పఠనం పై ఆసక్తిని ప్రజలలో,ప్రత్యేకించి విద్యార్థులలో పెంచాలి.




ప్రఖ్యాత రచయితలు.. షేక్స్పియర్, సర్వాంటిస్ మరియు ఇంకా గార్సిలోసోడెలావేగా ముగ్గురూ మృతిచెందినది 1616 ఏప్రిల్ 23 రోజున. వీరికి తోడు మౌరిసె డ్రువాన్, వ్లాదిమిర్ నబొకొవ్, జోసెఫ్ ప్లా సహా అనేక రచయితల జన్మదినం లేక తుదిశ్వాస వదిలిన దినం ఇదే. ఐక్యరాజ్య సమితి విద్యా,వైజ్ఞానిక మరియు సాంస్కృతిక సంస్థ (యునెస్కో) 1995 ప్యారిస్ సమావేశంలో పుస్తకాలకు మరియు రచయితలకు గౌరవ సమర్పణ చేయాలన్న నిర్ణయాన్ని చేపట్టడమైనది. దానికి తోడు 'యువతరాన్ని చదువు వైపుకు ఆకర్షించే 'ఉద్దేశంతో ప్రతి సంవత్సరం ప్రపంచ పుస్తక మరియు రచన హక్కుల దినోత్సవంగా ఆచరిస్తూ వస్తున్నారు.

**1996 నుండి ప్రతి సంవత్సరం**

"ఏప్రిల్ 23న" ప్రపంచ పుస్తక రాజధానిగా ఒక ప్రాంతాన్ని ఎంపిక చేసి, అక్కడి పుస్తకాలను ముద్రించే వారు.విక్రయదారులు మరియు గ్రంథాలయాలవైపు గమనించడం ద్వారా పుస్తకాల ప్రేమను ప్రచారం చేయడం జరుగుతుంది.

# జియో సైన్సెస్ ఫ్రెషర్స్ పార్టీ




ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in